క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్

మైదుకూరు : మైదుకూరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈనెల 13న శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు మొదటి అదనపు ఫస్ట్‌క్లాస్ జడ్జి ఆర్.హరిత తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ లోక్ అదాలత్‌లో 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇరు వర్గాల అంగీకారంతో కేసులను పరిష్కరించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రాథోడ్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం బీజేపీ అభ్యర్థి విక్రమ్‌సింగ్ రాథోడ్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో చిత్తాపూర్ బీజేపీ అభ్యర్థి రాథోడ్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను, ఆయన కుటుంబ సభ్యులను హత్య చేస్తానంటూ ఫోన్‌లో తీవ్రంగా దూషిస్తూ మాట్లాడటం అత్యంత దుర్మార్గమన్నారు. ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో ఈ నెల 19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను నిర్వహించనున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య సిద్ధాంతాలు, విలువలు ఎప్పటికీ ఆదర్శమేనన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రారెడ్డి, ఓబులేసు, ఫరూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రొద్దుటూరు : దివ్యాంగురాలైన పెళ్లి కూతురు సుజాతకు వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటరీ యూత్ వింగ్ జనరల్ సెక్రటరీ, ఎంపీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వినయ్‌కుమార్‌రెడ్డి బుధవారం రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుసేన్ సమస్యను తెలపగా వినయ్ కుమార్‌రెడ్డి స్పందించారు.

రక్తదాన శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రాణి తిరుమల దేవి డిగ్రీకాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్, దీప వలంటరీ బ్లడ్ బ్యాంకు ఆర్గనైజేషన్ సంయుక్తంగా బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల కరస్పాండెంట్ తరుణేందుశేఖర్, ప్రిన్సిపాల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి, దీప వలంటీర్ బ్లడ్ బ్యాంకు చైర్మన్ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో 60 మందికిపైగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

13 నుంచి హనుమాన్ శోభాయాత్ర

మైదుకూరు : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 13, 14 తేదీల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు రాష్ట్ర సేవిక సమితి నాయకులు తెలిపారు. బుధవారం పట్టణంలోని శివుని మాన్యం వీధిలో ఉన్న గణపతి ఆలయంలో జరిగిన సమావేశంలో శోభాయాత్ర వివరాలను వారు వెల్లడించారు. 13వ తేదీ శనివారం మధ్యాహ్నం పట్టణంలో బైక్ ర్యాలీతో శోభాయాత్ర జరుగుతుందన్నారు. 14న ఆదివారం హనుమాన్ జయంతి కార్యక్రమంలో బ్రహ్మంగారిమఠం వద్ద ఉన్న అచలానంద మఠం మఠాధిపతి విరజానందస్వామి ఆధ్వర్యంలో అంకాలమ్మ గుడి వద్ద నుంచి కలశాలతో మహిళలు ర్యాలీ నిర్వహించి పూజలు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బలరాంజీ, పాశం అనిల్, పందిటి పెద్దయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు పుస్తక పరిచయ సభ

కడప కల్చరల్ : నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సాయంత్రం 5.30 గంటలకు ఎలిచర్ల గజేంద్రనాథరెడ్డి రచించిన 'నా సీమ యాసే నా శ్వాస' పుస్తక పరిచయసభ నిర్వహించనున్నారు. ఆచార్య మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహించనున్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డులో గల కుమ్మరికొట్టాలు,చెన్నంపల్లె ఎస్టీ కాలనీలలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వార్డులోని ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టోను ఒక భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా భావించి అందులో పొందుపరిచిన ప్రతి హామీని అమలు చేయడంతో పాటు ఇవ్వని హామీలను సైతం ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు నోచుకోని వారిని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం, పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ ఈగయద్దారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి,రఘురామిరెడ్డి, సుబ్బారెడ్డి, వార్డు కౌన్సిలర్ రామ్మోహన్, మున్సిపల్ కమీషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కుమ్మరికొట్టాలులో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

ఇంటింటికి సంక్షేమం.. అర్హతే ప్రామాణికం

కాశినాయన : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వడ్డమాను, చిన్నాయపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కొంత మంది సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయ ఉద్యోగులను పిలిపించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు గ్రామ సచివాలయంలో గాని 1902కు గాని తెలియజేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

భూముల వేలం ఆదాయం రూ.8 లక్షలు



భూముల వేలంపాటలో పాల్గొన్న చైర్మన్, అధికారులు

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలోని శ్రీసోమేశ్వర స్వామి ఆలయ భూములు వేలం వేయగా రూ.8,85,500 ఆదాయం వచ్చింది. ప్రొద్దుటూరులోని రంగయ్యగారి సత్రంలో బుధవారం 170 ఎకరాలను ఆలయ అధికారుల వేలంపాట నిర్వహించారు. ఆలయ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆర్‌ఆర్ నరసింహా సింగ్, ఈఓ రామచంద్రాచార్యులు వేలంపాటను ప్రారంభించారు. వేలంపాటలో భూములను దక్కించుకున్న రైతులు ఏడాది పాటు పంటలను పండించుకోవచ్చునని అధికారులు చెప్పారు. ఈ పాటలో ఎటువంటి సమస్యలు, గొడవలు జరగకుండా టూటౌన్ ఎస్ఐ భాస్కర్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ముడియం గౌతమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : కులం, మతం పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. తుడుమలదిన్నె గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లపై నీరు నిల్వ ఉంటోందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన కొత్త రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ ఏర్పాటు చేయిస్తానని వారికి హామీఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతుండటంతో వచ్చే ఎన్నికల్లో మీ ఆశీర్వాదం కావాలని ప్రజలను కోరారు. జగన్‌ను మళ్లీ సీఎంగా చేస్తే ప్రజలకు మరింతగా సేవ చేసే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయంను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, సర్పంచ్ కృష్ణారెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శివరామిరెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఏఐటీయూసీ నూతన కమిటీ ఎన్నిక

బద్వేలు అర్బన్ : స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి సమక్షంలో బుధవారం నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో ఏఐటీయూసీ బద్వేలు పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు జి.ఎల్.నరసింహ, ప్రధాన కార్యదర్శిగా నాగేష్‌లు ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా ఎం.మల్లికార్జున, రవీంద్ర, సహాయ కార్యదర్శులుగా వీరభద్రుడు, మురళి, నరసింహ తదితరులను ఎన్నుకున్నారు.

కళల కాణాచీ.. కడప

వైవీయూ : కళల కాణాచీగా కడప గడప తన ప్రత్యేకను నిలుపుకుంటోందని వైవీయూ లలితకళల విభాగం ఆచార్యులు డా.మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం లలితకళల విభాగం ఆధ్వర్యంలో కూచిపూడి, కర్నాటక సంగీతం, కీబోర్డు వాయిద్యాలకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మూడు సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకుని కళాకారులుగా ప్రపంచంలోకి అడుగు పెడుతున్న విద్యార్థులను అభినందించారు. లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు ఉంటుందని, తమ కళను మరింత మెరుగుపరుచుకుని మంచి కళాకారులుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలన్నారు. కార్యక్రమంలో లలితకళల విభాగం అధ్యాపకులు కె.రెడ్డిశేఖర్‌రెడ్డి, సుధాకర్, ఎం.కామేశ్వరి, జి.వెంకటేశ్వరరావు, సుబ్బరాయుడు, కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతం, కీబోర్డు విద్యార్థులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ మాసాల్లో అకాల వర్షాలతో జిల్లాలో అరటి, బొప్పాయి, మామిడి తమలపాకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం ఉద్యావన పంటలకు ఎకరాలకు రూ. 40 వేలు చొప్పున పరిహారం చెల్లించాలన్నారు.

అనుమతులు లేని లేఅవుట్‌లపై చర్యలు

అనుడా వీసీ వై.ఓ.నందన్

బద్వేలు అర్బన్ : ఆయా పంచాయతీలలో నిర్మించే భవనాలకు, ఏర్పాటు చేసే లేఅవుట్‌లకు అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అనుడా) అనుమతి తప్పనిసరిగా ఉండాలని, అలా లేని వాటిపై చర్యలు తీసుకోవాలని అనుడా వైస్ చైర్మన్ వై.ఓ.నందన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బద్వేలు, గోపవరం మండలాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ (ప్లానర్స్)లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతలచెరువు, గోపవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన అనుమతులు లేని లేఅవుట్లకు నోటీసులు అందజేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పంచాయతీల్లో 300 చదరపు మీటర్ల వరకు వైశాల్యం ఉన్న భవనాల అనుమతులు పంచాయతీ కార్యదర్శుల వద్దనే తీసుకోవాలని, 300 చదరపు మీటర్ల పైన వైశాల్యం కలిగిన భవనాల అనుమతులు, లేఅవుట్ల అనుమతులు అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వద్ద తీసుకోవాలని కోరారు. ఆయా పంచాయతీల్లో ఉన్న అక్రమ నిర్మాణాలు, అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడవద్దని సూచించారు. సమావేశంలో అనుడా ఏపీఓ క్రిష్ణసింగ్, డబ్ల్యూపీఆర్ఎస్‌లు శ్వేత, సరస్వతి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనుడా వీసీ వై.ఓ.నందన్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

దువ్వూరు : మండల పరిధిలోని కటికపల్లె గ్రామంలో బుధవారం శ్రీరామచంద్రస్వామి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీతారాముల లక్ష్మణ విగ్రహాలకు అభిషేకాలు, కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం సేద్యపు ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ.30వేలు దువ్వూరు మండలం బాకరాపేటకు చెందిన గణేష్ ఎద్దులకు, రెండో బహుమతి రూ.20వేలు చాగంరెడ్డి లింగారెడ్డి, మూలె విఘ్నేశ్వరరెడ్డి ఎద్దులు సంయుక్తంగా గెలుపొందాయి. మూడో బహుమతి రూ.15వేలు చెన్నూరు మండలం ఓబుళంపల్లె గ్రామానికి చెందిన సతీష్‌రెడ్డి ఎద్దులు, నాలుగో బహుమతి రూ.10వేలు చెన్నూరు మండలం రాచిన్నాయపల్లె గ్రామానికి చెందిన పసుపుల బాలయ్య ఎద్దులు గెలుపొందాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు బహుమతులు అందించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

డ్రోన్ టెక్నాలజీని అందుబాటులోకి తేవాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

పోరుమామిళ్ల : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం జరిగిన డివిజన్‌లోని రైతు భరోసా కేంద్రాల అసిస్టెంట్ల సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి అయితే నాగేశ్వరరావు పాల్గొన్నారు. వ్యవసాయ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి అవసరమైన డ్రోన్ టెక్నాలజీ రైతులకు అందుబాటులోకి తేవాలన్నారు. దానిపై అర్హులైన వారికి పైలట్ శిక్షణ ఇవ్వాలన్నారు. ఆర్‌బీకేలలో నిర్వహించాల్సిన 29 రిజిష్టర్ల నిర్వహణపై ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి, 5 మండలాల వ్యవసాయాధికారులు, ఆర్‌బీకేల అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నకిలీ పట్టాలు సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ముంపు బాధితులు

గోపవరం : గోపవరం రెవెన్యూ పొలం 234 సర్వేనంబరులో నకిలీ పట్టాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం తహసీల్దారు దామోదర్‌రెడ్డికి ముంపు బాధితులు వినతిపత్రం అందజేశారు. అదే రెవెన్యూ పొలం అదే సర్వేనెంబరులో 1995లో సోమశిల వెనుకజలాల కింద ముంపుకు గురైన 170 మంది సూరేపల్లె బాధితులకు ఇళ్ళపట్టాలు పంపిణీ చేయడం జరిగిందని వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికే వారికి ఇచ్చిన స్థలాల్లో కొందరు బేస్‌మట్టాలు వేసుకుని ఇళ్ళ నిర్మాణాలు చేపడుతున్నారని, మరికొందరు నివాసం కూడా ఉన్నారని వారు తెలిపారు. ప్రస్తుతం ముంపు బాధితులకు ఇచ్చిన సర్వేనెంబరులో తమకు పట్టాలు ఉన్నాయని దొంగ పట్టాలు సృష్టించుకున్న వారు ప్రతిరోజు బెదిరింపులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి ముంపు బాధితులకు న్యాయం చేయాలని, అలాగే దొంగ పట్టాలు సృష్టించిన వారిని కూడా విచారించి చర్యలు తీసుకోవాలని వారు తహసీల్దారుకు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి మీసాలరవి, ముంపు బాధితులు సుబ్బరాయుడు, వెంకటేష్, రమణయ్య తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

పోరుమామిళ్ల: పర్యావరణాన్ని పరిరక్షించుకొనేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రేంజర్ వెంకటరమణారెడ్డి పిలుపిచ్చారు. బుధవారం వెంకటాపురం వనమిత్రలో 'లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి చుట్టుపక్కల ఉన్న ప్లాస్టిక్ కవర్లు, బాటిల్లు తీసివేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సర్పంచ్ గోపాలమ్మ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో మా వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సెక్షన్ ఆఫీసర్లు శ్రీకృష్ణ, రమణయ్య, బీటు అధికారులు ఆంజనేయులు, కరుణాకర్, హాసన్, సుభాషిణి, భారతి, వెంకటేష్ పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో అటవీ సిబ్బంది

పర్యావరణానికి అనుగుణంగా జీవనశైలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ రేంజ్ ఆఫీసర్ హిమాంజలి

ప్రొద్దుటూరు క్రైం : పర్యావరణానికి అనుగుణంగా జీవనశైలిని మార్చుకోవాలని అసిస్టెంట్ రేంజ్ ఆఫీసర్ హిమాంజలి తెలిపారు. స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని రాజీవ్ గాంధీ నేషనల్ పార్కులో బుధవారం లైఫ్ (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) మిషన్‌లో భాగంగా పర్యావరణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని చెప్పారు.అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర లక్ష్మయ్య, సెక్షన్ ఆఫీసర్ రమణ, బీట్ ఆఫీసర్స్ రమేష్, రాజేష్, ఉష, ఈశ్వరమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

అవినీతి ఉందనే అన్నా క్యాంటీన్ల రద్దు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పేదలకు భోజనం పెడుతున్నామనే సాకును చూపి టీడీపీ నేతలు దొంగ బోగస్ బిల్లులు పెట్టి డబ్బులు తీసుకుంటున్నారనే కారణంతోనే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను రద్దు చేసిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఒక్కో ప్రభుత్వం వచ్చినప్పుడు ఒక్కో పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్టీ రామారావు రూ.2 బియ్యం పథకం ప్రవేశపెట్టారని, వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్ నాడు-నేడు పథకం ద్వారా అన్ని శాఖల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. టీడీపీ నాయకుడు సీఎం సురేష్ నాయుడు చేసిన విమర్శలపై ఎమ్మెల్యే రాచమల్లు స్పందించారు. నాలుగేళ్ల క్రితం అన్నా క్యాంటీన్లను రద్దు చేసిన తర్వాత ఇప్పుడే ఎందుకు తిరిగి మీరు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాలనుకుంటున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రాజకీయ స్వార్థంతో ఎవరు సేవా కార్యక్రమాలు చేసినా ప్రజలకు మేలే జరుగుతుందని, వారు చేసే కార్యక్రమాన్ని తాను స్వాగతిస్తున్నానన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇంతవరకు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మాత్రమే సేవా కార్యక్రమాలను చేసేదని, ఇప్పుడు టీడీపీ నేతలు కూడా ముందుకు రావడం మంచి పరిణామమని తెలిపారు. విద్య, వైద్యం, పెళ్లి, పేరంటాలు, ఆకలి తీర్చేందుకు గత 26 ఏళ్లగా తాను సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూనే వస్తున్నానన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం సురేష్ నాయుడు అభ్యర్థిత్వాన్ని చంద్రబాబు అంగీకరించకపోతే ఈ అన్నదాన కార్యక్రమం ఉంటుందో లేదో గ్యారెంటీ లేదన్నారు. ఏడాది క్రితమే తాను రాజన్న భోజనం కార్యక్రమాన్ని అమలు చేయాలని భావించానని, జీవితాంతం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తానని తెలిపారు. త్వరలో మరో సేవా కార్యక్రమంతో ప్రజల ముందుకు వస్తానని, అందుకు టీడీపీ నేతలు కూడా సిద్ధమేనా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మందికి రూ.5,75,000 విలువైన చెక్కులు మంజూరయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల జోరు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో మున్సిపాలిటీ పరిధిలో ఎన్నడూ లేని విధంగా రూ.94కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. 16వ వార్డు పరిధిలోని మోడంపల్లెలో రూ.30లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవితో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు కోరిన వెంటనే అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, కౌన్సిలర్ రేవతి పాల్గొన్నారు.

పిల్లలకు కథల పోటీలు



కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

దువ్వూరు : స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం పిల్లలకు కథల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. సోషల్ టీచర్ నరసింహా విద్యార్థులకు సాంఘిక శాస్త్రం బోధించారు. అనంతరం క్యారమ్స్, లూడో చెస్ పోటీలు నిర్వహించారు.

పుస్తక పఠనంతో ఉపయోగం

రాజుపాళెం : వేసవిలో విద్యార్థులకు పుస్తక పఠనం ఎంతో ఉపయోగం చేకూర్చుతుందని రాజుపాళెం గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు అన్నాడు. విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులలో భాగంగా బుధవారం ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, నరసింహారెడ్డిలు విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో 22 మంది విద్యార్థులు హాజరయ్యారని, పుస్తకం చదవడం వల్ల మేథోశక్తి పెరుగుతుందని చెప్పారు. అంతేకాకుండా విద్యార్థులు ఇతరులతో మాట్లాడేటప్పుడు ఎలా, ఏవిధంగా మాట్లాడాలో తెలుస్తుందన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొంటున్నారు. బుధవారం విద్యార్థులకు జిరాఫీ చెస్ కోచ్‌లు గంగాధర్‌రెడ్డి, అరవింద్, తేజస్‌లు జిరాఫీ చెస్ ఆట, పాట, కథలతో శిక్షణ ఇచ్చారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం వేమన, సుమతి శతకాలు పాడి వినిపించారు. యోగా టీచర్ శ్రావణి, వెంకటసుబ్బమ్మ యోగాసనాలు నేర్పించారు. గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, టీచర్ చదువులబాబు, రెహ్మాన్ ఖాన్, శారద పాల్గొన్నారు.



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు